బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

ఎంపీ రఘునందన్‌రావు



బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న రఘునందన్‌రావు

లింగోజిగూడ: బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన వస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్ కాలనీలో సోమవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 30వేలకు పైగా సభ్యత్వాలు చేయించుకున్నారన్నారు. పార్టీ నాయకులు చురుకుగా పాల్గొని మరింత వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, బండారి భాస్కర్, కొత్త రవీందర్, పారంద మహేష్ పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులు ఆందోళన చెందవద్దు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: మూసీ ప్రాంత నివాసితులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఎల్‌బీనగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీవాసులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుధీర్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇళ్ల కూల్చివేతలకు రంగం సిద్ధం అయినట్లు పలు మీడియా కథనాలకు భయపడిన కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఇళ్ల ఒక ఇటుకను కూడా కూల్చకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, నాయకులు పవన్, కడియం మోహన్, వేణుగోపాల్, వీరాచారి, జ్యోతి, ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

అన్ని నాణేలు చెల్లుబాటులో ఉన్నాయి

మన్సూరాబాద్: నాణేలు చెల్లుబాటులో లేవనే అపోహవద్దని, అన్ని నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌బీనగర్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు వచ్చిన ఖాతాదారులకు రూ.10 నాణేలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు నాణేలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలు చెల్లుబాటులో లేవని అపోహ ప్రజల్లో ఉందని ఆ నాణేలు చెలామణిలో ఉన్నాయని, ఎవరైన తీసుకోవటానికి సంకోచిస్తే సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. డివిజన్ పరిధిలోని సహదేవ్‌సింగ్‌నగర్‌లో సుమారు రూ. 4.10 లక్షలతో చేపడుతున్న నూతన వాటర్ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించబోయే పైప్‌లైన్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అర్చన, కేసీరెడ్డి, పద్మారెడ్డి, సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ జవాన్ లక్ష్మయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన..

నాగోలు డివిజన్ బండ్లగూడ పెట్రోల్ బంక్ నుంచి తాజ్ హోటల్ వరకు చేపడుతున్న రోడ్డు పనులకు కార్పొరేటర్ చింతల అరుణ పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అందరూ ధార్మికంగా ఉండాలి

దిల్‌సుఖ్‌నగర్: మంచి చేయడం ఎంత ముఖ్యమో చెడు చేయకుండా ఉండడం అంతే ముఖ్యమని ఇస్కాన్ టెంపుల్ బ్రహ్మచారి ప్రణవానంద దాస్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో సోమవారం నిర్వహించిన మహా సత్సంగము నగర సంకీర్తనలో భాగంగా వాసవికాలనీ అష్టలక్ష్మి దేవాలయం నుంచి శ్రీరామకృష్ణపురం కోఆపరేటివ్ సొసైటీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రణవనందదాస్ మాట్లాడుతూ.. సమయాన్ని అక్కర్లేని విషయాల కోసం వృథా చేసుకోవడం చాలా బాధాకరమని అందరూ మంచిగా ధార్మికంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగ్‌రావు, అష్టలక్ష్మి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, ఉపేందర్ రెడ్డి, రామరావ్, రమేష్‌బాబు, గందే శ్రీకాంత్, విజయలక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన, పుష్ప పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవానంద దాస్

అభివృద్ధి పనులను పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం నియోజకవర్గంలోని తలాబ్ చంచలం డివిజన్ పరిధిలోని తలాబ్‌కట్టా, భవానీనగర్, చాచా గ్యారేజ్, షాజహాన్ ఫంక్షన్ హాల్, తదితర పాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సోమవారం దాదాపు 500 మంది రోగుల సహాయకులకు అల్పాహారాలు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేఆర్‌రాజ్‌కుమార్, ఇతర నాయకులు కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శంకర్, ఉస్మాన్ అలీ, శివకుమార్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంఎన్‌జే ఆసుపత్రిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యం

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- రోగాలబారిన బస్తీవాసులు
- తరలించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: రోజు రోజుకు వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అక్కడక్కడ నమోదవుతున్న డెంగీ కేసులతో భయాందోళనకు గురవుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో వారాల తరబడి పేరుకుపోతున్న వ్యర్థాలు, చెత్తా చెదారంతో దోమలు వృద్ధిచెంది రోగాలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల ముందే డ్రైనేజీ నీరు పారుతూ దుర్గంధంగా మారుతుందన్నారు.

ప్రకటనలతోనే సరిపెడుతున్నారు..

డెంగీపై చర్యలు తీసుకుంటున్నామని కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమైన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆచరణలో మాత్రం శూన్యమని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక కార్యక్రమాల పేర్లతో బ్యానర్లు కట్టి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తూతూ మంత్రంగా చేపడుతూ ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోన్ల పరిధిలోని మురికివాడల్లో నివసిస్తున్న వారు వివిధ రోగాల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీసున్నారు. చిన్నపాటి జ్వరమే అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫాగింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలనీలలో ఫాగింగ్ చేయకపోయినా చేసినట్లు రికార్డులను సృష్టించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. పేరుకుపోయిన చెత్తలో నుంచి ముక్కుపూటలదిరే దుర్వాసన వస్తోందని వాపోతున్నారు.



వాంబే కాలనీలోని ఓ అపార్టుమెంట్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

అమలుకాని అధికారుల ఆదేశాలు..

జీహెచ్‌ఎంసీ అధికారులు పారిశుద్ధ్యంపై తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో అంతగా అమలు కావడం లేదని అప్పుడప్పుడు వచ్చిపోయే నాయకులు, అధికారులు ఇక్కడి పరిస్థితులను పర్యవేక్షించి ఆదేశాలు జారీచేసి పోవడం తప్ప వాటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సింగరేణి వాంబే కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, తీగలగూడ, అంబేడ్కర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, పూసలబస్తీ తదితర కాలనీలలో ప్రజలకు వ్యాధులపై సరైన అవగాహన లేకపోవడంతో తరచూ రోగాల బారిన పడుతున్నారు. సింగరేణి వాసులందరూ గుడిసెవాసులు కావడంతో స్థానికంగా అభివృద్ధి కుంటుపడింది. ఇలాంటి ప్రాంతాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో సీజనల్ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సింగరేణి వాంబే కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగును చూపిస్తున్న స్థానికులు

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్

చాదర్‌ఘాట్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారని టౌన్‌ప్లానింగ్ అధికారులపైనే అధిక సంఖ్యల్లో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 55, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 50, కాకర రూ. 38, బీర రూ. 45, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 105, క్యారెట్ రూ. 40, దొండ రూ. 35–38, చిక్కుడు రూ. 55, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 17, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 35. మంగళవారం ఉదయం 9 వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మూసీ నిర్వాసితులకు రుణాలు

చాదర్‌ఘాట్: మూసీ పరిసరాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి యూసీడీ ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు మలక్‌పేట యూసీడీ పీఓ ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల్లో 130 మంది మహిళలు ఉన్నారని అందులో 120 మంది మహిళ సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఒక్కొక్క గ్రూపులో 10 మందిని ఒక్క యూనిట్‌గా ఏర్పాటు చేసి మొత్తం 12 గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క యూనిట్ సభ్యులకు రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు ఇస్తామని ఆయన వెల్లడించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

సైదాబాద్: ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీలో రమావత్ అంజలి–భాస్కర్ దంపతులు ఉంటున్నారు. అంజలి తాతయ్య చనిపోవడంతో ఆదివారం పిల్లలను ఇంట్లోనే ఉంచి సాగర్‌లోని ముల్లతండాకు వెళ్లారు. అంత్యక్రియలు ఆలస్యం కావడంతో పిల్లలను సమీపంలోని తెలిసిన వారి ఇంట్లో పడుకోమని సమాచారమిచ్చి వారు అక్కడే ఆగిపోయారు. సోమవారం ఉదయం పిల్లలు ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దంపతులిద్దరూ ఇంటికొచ్చి చూడ గా రూ.70వేలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, ఓ సెల్ ఫోన్, రూ.15వేల నగదు దొంగి లించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలి

నాగోలు: క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. జాతీయ యోగాసన పోటీలకు ఎంపికైన పూజిత ఖర్చులకి ఉప్పల ఫౌండేషన్ తరపున సోమవారం నాగోల్‌లోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరును తీసుకు రావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

నిత్య వెలుగులు.. ఆర్పేదెవరు?

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి దీపాలకు నిర్వహణ కరువై నిరంతరం వెలుగుతున్నాయి. రాత్రి వెలిగి ఉదయం ఆరి పోవాల్సిన వీధి దీపాలు నిత్య వెలుగులు విరజిమ్ముతుండటంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు రాత్రి సమయంలో మాత్రమే వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – వనస్థలిపురం



అనాథ విద్యార్థులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీ కాలనీ అధ్యక్షులు జొన్నాడ మోహన్ రెడ్డి, వారి అమ్మా నాన్నల మొదటి వర్ధంతి సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహా విద్యార్థుల వసతులు, చదువుల కోసం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యార్థి గృహంలో అవకాశం రావడం మీ అదృష్టమని గృహ కమిటీ కల్పించిన అన్ని సౌకర్యాలు, విద్యా అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, మోహన్‌రెడ్డి సతీమణి మీనా, కుమారుడు జ్ఞానసాయి రెడ్డి, జంగారెడ్డి, హర్ష పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ఔటర్ ఎగ్జిట్ వద్ద ఉన్న నాయకులు

భారీ ర్యాలీగా తరలివచ్చిన నాయకులు

మహేశ్వరం: కొంగరకలాన్ ఫ్రాక్స్‌కాన్ కంపెనీ పనులను పరిశీలించడానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రావిర్యాల ఔటర్‌రింగ్ ఎగ్జిట్ 13 వరకు భారీ ర్యాలీగా చేరుకొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఔటర్ దిగగానే కేఎల్లార్‌తో పాటు నాయకులు కలిసి కాంగ్రెస్ కండువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, ఎర్రవాపు ఇశ్రాయేల్, కాకి ఈశ్వర్, కృష్ణనాయక్, రాజునాయక్, లచ్చానాయక్, జానకీరామ్, జైపాల్‌రెడ్డి, రాజు, రంజిత్‌కుమార్, మురళీధర్‌రెడ్డి, లాజర్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోండి

రసూల్‌పురా : కరోనా సమయంలో కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలోని శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కొందరు కార్మికులు మరణించారని వారి కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాల కోసం ఖాళీల 5 శాతం సీలింగ్‌ను మినహాయించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని సోమవారం ఈటల కోరారు. రక్షణ మంత్రిత్వ శాఖ కింద కంటోన్మెంట్ బోర్డులు డీమ్డ్ మున్సిపల్ సేవలను అందించే ఏకైక సంస్థలను పొరుగున్న ఉన్న మున్సిపాలిటిల్లో ఉద్యోగి మరణించిన రెండు మూడు నెలల్లోనే కారుణ్య ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయని ఈటల తెలిపారు.

చిన్నారి మృతికి వైద్యులు కారణమంటూ ఆందోళన

మలక్‌పేట: మూసారంబాగ్ చౌరస్తాలోని సేఫ్ చిల్డ్రన్ ఆసుపత్రిలో రెండున్నర నెలల బాలుడి మృతికి వైద్యులే కారణమంటూ తల్లిదండ్రులు సోమవారం ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అక్కారం గ్రామానికి చెందిన కేతావత్ హనుమంత్ తన రెండున్నర నెలల బాబు న్యుమోనియా, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఈ నెల 9న సేఫ్ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో చేర్పించామన్నారు. మూడు రోజుల నుంచి ఐసీయూలో ఉంచి చికిత్స అందించి ఆరోగ్యం మెరుగవ్వడంతో ఆదివారం జనరల్ వార్డుకు మార్చారు. సోమవారం సాయంత్రం డిశ్చార్జి చేస్తామన్నారు. మధ్యాహ్నం ఓ నర్సు వచ్చి ఇంజెక్షన్ చేసిన 10 నిమిషాలకు బాబు మృతి చెందాడని తండ్రి హనుమంత్ కన్నీటి పర్యంతమయ్యాడు. అయితే.. న్యుమోనియా, గుండె సంబంధిత వ్యాధి, ఆయాసంతో ఉన్న బాబును మూడు రోజులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించాం. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాతే ఆదివారం బాబును జనరల్ వార్డులోని మార్చాం. సోమవారం ఉదయం ఫీడింగ్ ఇవ్వమని చెప్పామని అప్పుడూ బాగానే ఉన్నాడు. మధ్యాహ్నం ఫీడింగ్ పట్టినప్పుడు కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోవడం జరిగిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని డాక్టర్ హరిత వెల్లడించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

యాకుత్‌పురా: యాకుత్‌పురా ధోబీఘాట్ ఆర్‌యూబీ బ్రిడ్జి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్లకొమ్మలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. చెట్లకొమ్మల కారణంగా వీధిదీపం, విద్యుత్ తీగలు కనిపించకుండాపోయాయి. పక్కనే ఉన్న మరో స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కూడా చెట్లకొమ్మల మధ్య చిక్కుకుపోయింది. వీధిదీపం కనిపించకపోవండంతో రాత్రివేళల్లో ఈ ప్రాంతంలో అంధకారం అలుముకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 8వ డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలో రూ. 29లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలుత డ్రైనేజీ పనులు చేపట్టి అనంతరం సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు సీసావెంకటేష్‌గౌడ్, మోదుగు లావణ్యశేఖర్‌రెడ్డి, కుంభంకిరణ్‌కుమార్‌రెడ్డి, సుమన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నేతలు కొత్త కిశోర్‌గౌడ్, పొన్నం తరుణ్‌గౌడ్, వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు విధులు నిర్వహించారని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్ యూనియన్



జగదీశ్వర్, ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్‌కుమార్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆర్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి బుచ్చిరెడ్డిలతోపాటు యూనియన్‌కు చెందిన పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మట్లాడుతూ రౌండ్ ది క్లాక్ పద్ధతిలో రేయింబవళ్లు ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, ముఖీద్, ఖాదర్, రాజు, అహ్మద్, ముజాయిద్, ప్రియాసుదర్శన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్



కేఎల్లార్‌కు మొక్క అందజేస్తున్న శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణం, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మరింత చెందుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. అంతకు ముందు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, జంగయ్య, ఏర్పుల శ్రీశైలం, గణేశ్, పరమేశ్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.